ఉపాధి కూలీలకు రూ.55 కోట్లు

నాలుగు నెలల బకాయిలు విడుదల



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు వేతనాలు వచ్చేశాయ్. నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇబ్బంది పడుతున్న కూలీలకు ప్రస్తుతం పనిచేసిన వేతనాలతో సహా వారి ఖాతాలకు జమ చేశారు. జిల్లాలో 99 వేల కూలీలకు ఈ వేతనాలు అందించారు. జిల్లా మొత్తం రూ.55 కోట్లు విడుదల య్యాయి. నాలుగు నెలలుగా వేతనాల కోసం ఎదురు చూస్తున్న ఉపాధి కూలీలకు దసరా ముందు వేతనాలు అందించి పండుగ ఆనందం రెట్టింపు చేశారు. జిల్లాలో తాడేపల్లిగూడెం మండలంలో మినహా మిగిలిన ప్రాంతాలు కాలువ కింద ఉండటంతో పెద్దగా పనులు లేకపోవడంతో మే, జూన్ నెలలోనే ఎక్కువ పనులు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేసిన వేతనాలు మన జిల్లాకు 55 కోట్లు విడుదలయ్యాయి. ఉపాధి నిధుల విడుదలలో జాప్యం కారణంగానే ఆలస్యమైనట్టు అధికారులు చెబుతున్నారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

ఈ సీజన్‌లో సాధారణ వినియోగం 8 నుంచి 9 మిలియన్ యూనిట్లు

ఉక్కపోత, వాతావరణ ప్రభావంతో 10 మిలియన్ యూనిట్లు దాటుతున్న వాడకం



భీమవరం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల కారణంగా ఎండ తీవ్రత పెరగటంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. మండు వేసవిలో ఉన్నట్లుగా వాతావరణం ఉంటంతో విద్యుత్ వినియోగం కూడా అదేరీతిలో పెరిగిపోయింది. వర్షాకాలంలో విద్యుత్ వాడకం తగ్గుతుంది. వాస్తవంగా 8 మిలియిన్ యూనిట్లు వాడకం ఉంటుంది. ఐతే వేసవిని తలపించే విధంగా ఎండలు పెరగిపోవడం వల్ల ఉక్కవ పోతనుంచి ఉపశమనం కోసం ఏసీల వాడకం పెరగటంతో విద్యుత్ వినియోగం పెరిగిపోయింది.ఈనెల 7వ తేదీ నుంచి 10 వతేది వరకు పరిశీలిస్తే 10 మిలియన్ యూనిట్ల వాడకం జిల్లాలో సాగుతోంది 7వ తేదీన 10.192 మిలియన్ యూనిట్లు వాడకం జరిగింది. 8వ తేదీన 10.193 యూనిట్లు, 9న 10.323 యూనిట్లు, 10న 10.161, 11న 10.170 , 12న 9.627, 13వ తేదీన 9.888 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం జరిగినట్లు నమోదైంది. వినియోగం పెరగడంతో అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు. ఎక్కడా ట్రిప్ అవకుండా చూసుకుంటున్నారు.

నేడు మెగా డీఎస్సీ అభ్యర్థుల తుది జాబితాలు విడుదల



ఏలూరు అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ- 2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు తుదిగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలు సోమవారం విడుదల చేయడానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. జాబితాలను ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్, జువనైల్ వెల్ఫేర్ యాజమాన్యాల వారీగా, పోస్టుల వారీగా రూపొందించారు. వీటిపై డీఎస్సీ కమిటీ ఛైర్మన్ అయిన కలెక్టర్ ఆమోదాన్ని తీసుకున్నట్టు కన్వీనర్, ఉమ్మడి జిల్లా డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఆదివారం వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1074 పోస్టులను భర్తీ చేయనున్న విషయం విదితమే. ఎంపిక జాబితాలను ఏలూరులోని కలెక్టర్, డీఈవో కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు, apdsc.apcss.in అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. కాగా రెండుదఫాలుగా మెడికల్‌బోర్డు నిర్వహించిన వైకల్యశాతం అసెస్‌మెంట్ టెస్టులో వ్యత్యాసాల కారణంగా మెరిట్‌లో తనకు అన్ని అర్హతలున్నప్పటికీ సెలక్షన్ జోన్ పరిశీలన నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ జిల్లాకు చెందిన దివ్యాంగుల(పీహెచ్) కోటా అభ్యర్థిని ఒకరు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు తెలిసింది. దీంతోపాటు రాష్ట్రస్థాయిలోనూ రాయలసీమకు చెందిన కొందరు అభ్యర్థులు పోస్టుల(స్కూల్ అసిస్టెంట్/ఎస్జీటీ)కేటాయింపు విధానాన్ని వ్యతిరేకిస్తూ న్యాయస్థానం తలుపులును తట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఉద్యోగాలకు ఎంపికైన తుది జాబితాలు సోమవారం విడుదల కానుండటం గమనార్హం. దీనిపై విద్యాశాఖ ఎలా స్పందించిందీ తెలియరాలేదు. మరోవైపు డీఎస్సీ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాలు సోమవారం విడుదలచేస్తుండటంతో, ఉమ్మడి జిల్లాలో మండలాల వారీగా ఉద్యోగాలుపొందిన వారిని గుర్తించి, వారిని 18న ఏలూరుకు తీసుకురావడం, ఎంపిక చేసిన పాఠశాలల్లో భోజన, వసతి ఏర్పాట్లు కల్పించడం, 19న ఉదయం వెలగపూడిలో జరిగే నియామకపత్రాల అందజేత కార్యక్రమానికి తీసుకెళ్లే పనులను పర్యవేక్షించడానికి డీవైఈవోలు, ఎంఈవోలకు ఇన్‌చార్జి బాధ్యతలను డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదివారం అప్పగించారు.వీరందరితో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి, పాఠశాలల వారీగా బాధ్యతలను కేటాయించనున్నారు.

నరసాపురం-మైసూర్ మధ్య స్పెషల్ రైళ్లు


గూడెం మార్కెట్‌కు ఉల్లి జోరు 7
కర్నూలు ఉల్లిని వినియోగించేలా చర్యలు చేపట్టాలి : జేసీ
తగ్గిన వంగ.. పెరిగిన బెండ.. మార్కెట్ ధరలు

అయ్యో.. రొయ్యా..!



వైరస్...వైరస్.. ఇప్పుడు ఆక్వా రైతుల నోట ఇవే మాటలు వినిపిస్తున్నాయి.. "18 రోజులకే వైరస్ వచ్చి చెరువులు పాడైపోయాయని జాగ్రత్తగా ఉండాలంటూ ఒకరు హెచ్చరిస్తుంటే నెలరోజుల లోపు పిల్ల రొయ్యలకు వైరస్ రాదు కదా అని మరొకరు డౌట్ పడుతుంటే.. ఏమో మా పక్కన 15 రోజులకే వైరస్ అటాక్‌తో చెరువు పోయిందంటూ ఇంకొకరు ఆవేదన వ్యక్తం చేసుకుంటున్నారు.. రైతులు కలుసుకున్నా ఫోన్‌లో అయినా నెలరోజులుగా ఇదే టాపిక్ నడుస్తోంది.. వాతావరణంలో మార్పులు, సీడ్‌లో నాణ్యత లేకపోవడం, వైరస్ అన్నీ కలిసి రైతులను నట్టేట ముంచుతున్నాయి..

రొయ్యలను వెంటాడుతున్న వైరస్
నెలరోజుల లోపు పిల్లలకూ అటాక్
నాణ్యత లేని సీడ్, వాతావరణంలో మార్పులతో తీవ్ర నష్టాలు
సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
లబోదిబోమంటున్న ఆక్వా రైతులు


వైరస్ సోకిన రొయ్యలు

ఆకివీడు రూరల్ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :వర్షాకాలం అంటేనే ఆక్వాకు గడ్డుకాలం. ప్రస్తుతం ఉన్న తీవ్ర పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు. వర్షాకాలంలో ముసుర్లు, తుఫాన్లు, అల్పపీడనాల వంటి పరిస్థితులతో డీవో సమస్యలు వచ్చి పిల్లవేసి 40 రోజులు దాటిన చెరువులు మాత్రమే ఎఫెక్ట్ అయ్యేవి. ప్రస్తుతం అలా కాదు.. రోజులతో సంబంధం లేదు.. చెరువులో వేసి 15 రోజులు వయసున్న పిల్లకూడా వైరస్ ఎటాక్‌తో చనిపోతున్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల నీటిలో పారా మీటర్స్ మారిపోతుంటాయి. దీంతో రొయ్యలలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. దీంతో వైరస్ బారిన పడు తున్నాయి. దీంతో రొయ్యలు ఈదడం మొదలుపెడతాయి. ఆలస్యం చేస్తే చనిపోయి కిందకు దిగిపోతాయి. ఇవి ఈదడం ప్రారంభించగానే కాకులు, కొంగలు, పక్షులు వేటాడడం ప్రారంభిస్తాయి. వీటిని తీసుకెళతూ పక్క చెరువులలో పాడవేయడం, వాటిలో వాలడం చేస్తే చాలు వాటి ద్వారా పక్క చెరువులకు వైరస్ సోకుతుంది. ఈవిధంగా ప్రస్తుతం దాదాపు 95% సాగు వైరస్ ఎటాక్‌తో నష్టం వాటిల్లింది. మిగిలిన సాగు భయాందో ళనల మధ్య సాగుతున్నది. తక్కువ రోజులు ఉన్న చెరువులలో పిల్లలను కొనుగోలు చేసేవారు లేక పట్టుబడి ఖర్చులు రావన్న ఉద్దేశంతో మందులు పిచికారీ చేస్తున్నారు.

నాణ్యత లేని సీడ్, వాటర్

తక్కువ ఖరీదుకు వస్తుంది.. లక్షకు లక్ష బోనస్ వంటి వాటితో నాణ్యతలు పాటించని హేచరీలలో రైతులు సీడ్ కొనుగోలు చేస్తున్నారు..తక్కువ రేటుకు సీడ్ కావాలన్న ఆలోచనను పసిగట్టిన హేచరీలు నాసిరకం పిల్లను అంటగట్టడంతో వాటిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో వ్యాధుల బారిన పడుతున్నాయి. అంటు వ్యాధిలా అన్ని చెరువులకు పాకేస్తున్నది. అనుమతిలేని హేచరీలను నియంత్రించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రొయ్యల చెరువుల్లోని నీటిని నేరుగా పంటకాలువలలోకి వదిలేస్తున్నారు. ఈ నీటినే దిగువ ప్రాంతంలో ఉన్న చెరువులు వారు నింపుకోవాల్సిన పరిస్థితి. దీంతో కలుషితమైన నీటిని నింపుకుని మందులు పిచికారీ చేసి సాగు చేస్తుండటం వల్ల ఇబ్బందులు తలెత్తున్నాయని రైతులు వాపోతున్నారు. రొయ్యల సాగునీటిని మురుగు కాలువలలోకి మాత్రమే వదిలేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యాపారుల కనుసన్నల్లోనే అంతా

రొయ్యలను కొనుగోలు చేసే వ్యాపారస్తుల కనుసన్నల్లోనే అంతా జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీడ్ ఎంత కొనుగోలు చేశారు ? ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నది ? ఫీడ్ ఎంత వెళుతున్నది ? వైరస్, వైట్‌గట్, ఈహెచ్‌పీ వంటి వ్యాధులు వల్ల ఏ కౌంటు - మిగతా 8లో..


పుల్లాయిగూడెంలో ధాన్యం పట్టుబడులు చేస్తున్న రైతులు

ధర లేక రైతన్న దిగాలు

బస్తాకు రూ.100 మింగేస్తున్న దళారులు

ఆరా తీసిన జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యానికి ధరలేక విలవిల్లాడుతున్నారు. జిల్లాలోనే తాడేపల్లిగూడెం మండలంలో ముందస్తుగా వరి మాసూళ్లు జరుగుతాయి. రైతులు బోర్లపై సాగు చేస్తారు. ఇక్కడ మాసూళ్లు పూర్తయి పంట చేతికి వచ్చింది. పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు.వరి మాసూళ్లు మొదలు పెట్టిన రెండు రోజుల్లోనే మిల్లర్లు, దళారులు బస్తాకు రూ.100 కోత పెట్టారు. రూ.1350 నుంచి రూ.1250కి తగ్గించేశారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక దిక్కు తోచని స్థితితో రైతులు తమ ధాన్యం అయినకాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జేసీ రాహుల్ కుమార్ ఆదివారం ఆకస్మికంగా రైతు క్షేత్రాలను సందర్శించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తేమ శాతంతో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయిస్తే గిట్టుబాటు ధర వస్తుందని హామీ ఇచ్చారు.

అయినకాడికి అమ్ముకుంటున్నాం..



ఈ సీజన్‌లో ఎకరాకు 40 నుంచి 45 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. కానీ ఎప్పటిలాగే కట్టు పొట్టు పేరుతో కమీషన్ ఏజెంట్‌లకు ధాన్యం తూయాల్సి వస్తున్నది. రెండు రోజుల క్రితం రూ.1350 ధర పలికిన ధాన్యం ఇప్పుడు వంద రూపాయలు తగ్గించేశారు. చేసేదేమీ లేక అయినకాడికి అమ్ముకుంటున్నాం.

- కొండపల్లి రాజు, అప్పారావుపేట

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి



ప్రభుత్వం ఈ సీజన్‌లో ముందస్తుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. మాకు మిగిలిన ప్రాంతాల కంటే ముందుగానే ధాన్యం చేతికి వస్తుంది. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే దళారుల బాధ తప్పుతుంది.

- మద్ది రవి ప్రసాద్, అప్పారావుపేట

త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు : జేసీ


అధికారులు, మిల్లర్లతో సమీక్షిస్తున్న జేసీ

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జేసీ రాహుల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారులతో ఆదివారం సమీక్షించారు. రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖ, రైస్‌మిల్లర్లతో ధాన్యం సేకరణపై చర్చించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు త్వరిత గతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు అవసరమైన సంచులను ఆర్‌ఎస్‌కే సిబ్బంది, ధాన్యం రవాణా చేసే వాహనాలను కూడా సిద్ధం చేయాలని కోరారు. మండలంలో ఎన్ని ఎకరాల్లో కోతలు జరిగాయి ? దిగుబడులు ఎలా వస్తున్నాయి ? అని జేసీ అడిగారు. కడియద్ద రైతు సేవా కేంద్రాన్ని జేసీ పరిశీలించారు. ఆర్డీవో ఖతీబ్‌కౌసర్ భానో, తహసీల్దార్ సునీల్ కుమార్, మండల వ్యవసాయాధికారి నారాయణరావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల పాల్గొన్నారు.

ఉధృతంగా ఎర్రకాలువ


మాధవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువ

నిలిచిన రాకపోకలు

తాడేపల్లిగూడెం రూరల్/ నిడదవోలు,సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. కొంగువారిగూడెం జలాశయం నిండిపోవడంతో ఆరు వేల క్యూసెక్కుల నీరు కిందకు వదలడంతో ఎర్రకాలువ గండ్లు నుంచి వరదనీరు చేలలోకి ప్రవహిస్తోంది. దీంతో రైతులు తాము పండించిన పంట పాడైపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాధవరం-కంసాలిపాలెం మధ్య ఉన్న దారి వంతెన పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణీకులు అటుగా ప్రయాణించవద్దని హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. మరింత వరదనీరు కిందకు వదిలితే వరిపంట నాశనం అయ్యే ప్రమాదం ఉంది. శింగవరం, తాళ్ళపాలెం గ్రామాల మధ్య కాలువ ప్రవాహానికి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత, తహసీల్దార్ బీ.నాగరాజు నాయక్, ఎంపీడీవో జగన్నాథరావు ఆ ప్రాంతాల్లో పర్యటించారు. కంసాలిపాలెం, శింగవరం, తాళ్ళపాలెం, శెట్టిపేట, తిమ్మరాజుపాలెం గ్రామాలకు ఎర్రకాలువ వరద ముప్పు పొంచి ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పెరుగుతున్న గోదావరి

కుక్కునూరు/పోలవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద భద్రాచలం వద్ద నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. ఆదివారం


పోలవరం బోట్ పాయింట్ వద్ద వరద ఉధృతి

ఉదయం 36.2 అడుగులు ఉండగా సాయంత్రానికి 36 అడుగులు ఉంది. ఎగువున తగ్గుతున్న క్రమంలో దిగువన పెరుగుతోంది. పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు నుంచి 6,05,754 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 30.700 మీటర్లు, దిగువన 21.600 మీటర్ల నీటిమట్టం నమోదైంది. పట్టిసీమ శివక్షేత్రం వద్ద వరద ఉధృతంగా ఉంది. ఏజెన్సీ కొండవాగులు కొవ్వాడ కాలువ, రేపల్లెవాడ, గుంజవరం, జిల్లేళ్ల గూడెం కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగుల జలాలు పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ రెగ్యులేటర్‌లో 23 గేట్ల ద్వారా గోదావరిలో కలుస్తున్నాయి. కడమ్మ స్లూయిజ్ వద్ద జలాలు గేట్లను తాకి ప్రవహిస్తున్నాయి.

90 శాతం రేషన్ పంపిణీ

నేడు సెప్టెంబరు నెల రేషన్‌కు చివరి రోజు
జిల్లాలో 5 లక్షల 57 వేల 79 కార్డులు
రేషన్ తీసుకున్నవారు 4 లక్షల 97 వేలు
ఇంకా తీసుకోవలసినవారు 59 వేలు



ఉండి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెలకు సంబంధించి రేషన్ సరుకుల పంపిణీకి చివరి తేదీ 15వతేదీ సోమవారంతో ముగుస్తుంది. ఆదివారం సాయంత్రం నాటికి జిల్లాలో సుమారుగా 90 శాతం పంపిణీ పూర్తయినట్లు సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. ఇంకా 56 వేల మంది లబ్ధిదారులు తీసుకోవలసి ఉంది. సివిల్‌సప్లయిస్ అధికారులు రేషన్ డీలర్లను అప్రమత్తం చేశారు. జిల్లాలో రేషన్‌కార్డుదారులకు ఉచితంగా బియ్యం, పంచదార అరకిల్లో రు.17 లకు అందిస్తున్నది. జిల్లావ్యాప్తంగా 5 లక్షల 57 వేల 79 మంది కార్డుదారులు ఉండగా ఆదివారం సాయంత్రానికి 4 లక్షల 97 వేల 500 మంది రేషన్ సరుకులు తీసుకున్నారు. ఇంకా 59 వేల 579 మంది తీసుకోవలసి వున్నట్లు సివిల్ సప్లయిస్ అధికారులు చెబుతున్నారు. సోమవారం చివరిరోజు కావడంతో డీలర్లు అంతా ఉదయమే దుకాణాలను తెరిచి రేషన్ అందించాలని అధికారులు సూచిస్తున్నారు. ఒక పక్క రేషన్ పంపిణీ, మరో పక్క కొత్తకార్డులు అంద జేయడంపై డీలర్లను అధికారులు అభినందించారు.

డీలర్లకు కొత్త ఈ-పోస్ యంత్రాలు



భీమవరం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డు దారులకు వేగవంతంగా రేషన్ బియ్యం, పంచదార వంటి వస్తువులను అందించేందుకు డీలర్లకు కొత్త ఈ- పాస్ యంత్రాలను అందించారు. జిల్లాలో మొత్తం 1052 రేషన్ షాపులు ఉండగా వాటి అన్నింటికి ఈ పాస్‌యంత్రాలు పౌరసరఫరాల శాఖకు అందాయి. దీంతో గత రెండు రోజులుగా యంత్రాలను మండలలా వారీగా డిలర్స్‌ను రప్పించి అందిస్తున్నారు. గత ఈ-పాస్ యంత్రాలు 2జితోను బటన్ సిస్టంతో పని చేసేవి. దీనివల్ల సిగ్నల్ సరిగ్గా లేకపోవటం, అంకెలు పడకపోవటం, మిషన్‌లు ఇచ్చి చాలా కాలం అవ్వటం వల్ల ఇబ్బందులు రావటంతో వాటి స్థానంలో కొత్త టెక్నాలజీ మిషన్‌లు అందుబాటులోకి తీసుకువచ్చారు. 5జీ నెట్‌తో కూడి, టచ్ స్ర్కీన్‌తో ఉండే ఈ మిషన్‌లు డీలర్స్‌కు అందించారు. దీనివల్ల సిగ్నల్ పూర్తిస్థాయిలో అందటంతోపాటు వేగంగా పని చేస్తుందని అధికారులు తెలిపారు. మిషన్ తీసుకున్న గంట తరువాత వినియోగంలోకి తీసుకోవచ్చునని తెలిపారు. మండలలా వారీగా కార్డు దారుల వివరాలను నమోదు చేసి వారికి అందిస్తున్నామని తెలిపారు. మరో 5 మండలాలకు సంబంధించి మిషన్‌లు అందిస్తే నూరుశాతం పంపిణీ పూర్తి అవుతుందని తెలిపారు. 15వ తేదీ సోమవారం రేషన్ ఇచ్చేందుకు ఆఖరు కావటంతో మిగిలిన డీలర్స్‌కు మంగళవారం అందించనున్నారు.

రెండేళ్లుగా నిలిచిన 'ఇన్‌స్పైర్ మనక్'

బాల మేధావుల సృజనాత్మకతకు అందని స్ఫూర్తి

- జిల్లా ప్రదర్శనల నుంచే రాష్ట్ర, జాతీయస్థాయి ఎగ్జిబిషన్లకు ఎంపికలు
- ఈ ఏడాదైనా జాతీయస్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన జరిగేనా ?
- నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ గడువు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థి దశ నుంచే ఆసక్తి కల్పించడం ద్వారా బాలల మదిలో మెదిలే నూతన ఆవిష్కరణలకు అంకురార్పణ చేయాలనే లక్ష్యంతో పాఠశాల స్థాయిలో అమలుచేస్తోన్న ప్రేరణ/స్ఫూర్తి(ఇన్‌స్పైర్ మనక్) కార్యక్రమం క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లకే పరిమితమవుతోంది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ(డీఎస్టీ) నేతృత్వంలో జాతీయస్థాయిలో అన్ని రాష్ట్రాల్లో ఎస్సీఈఆర్టీ సహకారం తీసుకుని జిల్లాల్లో ప్రభుత్వ గుర్తింపువున్న అన్ని పాఠశాలల్లో ఆరు నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలను సైన్సు అంశాల్లో నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేయించడం ద్వారా వారిని బాల మేధావులుగా ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ఇన్‌స్పైర్ (ఇన్నోవేటివ్ ఇన్‌సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్), మనక్ (మిలియన్ మైండ్స్ అగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) అవార్డులకు ఏటా విద్యార్థులను ఎంపికచేయడం మినహా వారు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు విద్యాశాఖ అవకాశం ఇవ్వడం లేదు. గత రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. ఫలితంగా జిల్లాల్లో ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు కేంద్రప్రభుత్వ మిచ్చే నగదు ప్రోత్సాహకాలను తీసుకోవడం తప్ప వారు తయారు చేసిన ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో ప్రదర్శనకు పెట్టడానికి అవకాశం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత విద్యాసంవత్సరానికి(2025-26) సంబంధించి తాజాగా మరోదఫా ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు విద్యార్థులనుంచి రిజిస్ట్రేషన్లకు ఆహ్వానం పలికిన డీఎస్టీ, ఎస్సీఈఆర్టీలు బాలబాలికలు రూపొందించిన సైన్సు ప్రాజెక్టులను మళ్లీ కాగితాలకే పరిమితం చేస్తాయా లేక జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ప్రదర్శనల వరకు ప్రతిభగల బాలమేధావులను ప్రోత్సాహిస్తాయా అనేదానిపై డైలమా నెలకొంది.

రెండేళ్లుగా కాగితాలకే సైన్సు ప్రాజెక్టులు పరిమితం..

అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు రిజిస్ట్రేషన్ చేసుకుని, నామినేషన్లను సబ్మిట్‌చేసేందుకు అర్హులే. ఆ మేరకు ఒక్కో ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు సైన్సు ప్రాజెక్టులు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు, జూనియర్ కళాశాలనుంచి ఏడు ప్రాజెక్టుల వరకు ఈ-ఎంఐఏఎస్ వెబ్‌పోర్టల్‌లో తమ సృజనాత్మక ప్రాజెక్టు/ఆలోచనలను ఒక కాగితంపై రాసి డాక్యుమెంట్‌గా సబ్మిట్‌చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుల రూపకల్పనలో ఉపాధ్యాయులు గైడ్‌టీచర్లుగా వ్యవహరిస్తుంటారు. ఈవిధంగా అన్ని రాష్ట్రాల నుంచి అందిన డాక్యుమెంట్లనుంచి ఉత్తమమైన ప్రాజెక్టులను ఎంపికచేసి, వాటిని భౌతికంగా తయారుచేసేందుకుగాను ఇన్‌స్పైర్ మనక్ అవార్డులను ఇస్తారు. అవార్డుకి ఎంపికైన ఒక్కో విద్యార్థికి రూ.10వేలు చొప్పున ప్రాజెక్టు వర్కింగ్ మోడల్‌రూపంలో తయారీకి గాను సంబంధిత విద్యార్థి బ్యాంకు ఖాతాకు కేంద్రప్రభుత్వం జమ చేస్తుంది. గైడ్ టీచర్ సాయంతో తయారుచేసిన ప్రాజెక్టుల వర్కింగ్ మోడళ్లను జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించాలి. వీటిని మిగతా పాఠశాలల బాలబాలికలు సందర్శించడానికి ఎగ్జిబిషన్‌ను విద్యాశాఖ ఏర్పాట్లుచేస్తుంది. వీటిలో ఉత్తమమైన ప్రదర్శనలను ఎంపిక చేసి, రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో వినూత్నమైన వాటిని ఎంపికచేసి దక్షిణ భారతస్థాయికి, అక్కడ ఉత్తమమైన వాటిని జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌కు పంపిస్తారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలనేవి లేకపోవడంతో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులన్నీ కాగితాలు/డాక్యుమెంట్లు/వీడియో చిత్రాలకే పరిమితమవుతున్నాయే తప్ప వాటిని ప్రదర్శనకు పెట్టడంగాని లేదు.

ప్రాజెక్టులు ఉన్నాయా ? లేవా ?

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులకు సంబంధించి వెబ్‌పోర్టల్‌లో సబ్మిట్ చేసిన నామినేషన్ డాక్యుమెంట్లు/ వీడియోల నుంచి ఉత్తమమైనవాటిని ఎంపిక చేయడంతోనే గత రెండేళ్లుగా సరిపెడుతుండడంతో ఇపుడు ఆ ప్రాజెక్టులు సంబంధిత పాఠశాలలు, కళాశాలల్లో భౌతికంగా ఉన్నదీ, లేనిదీ విషయాలపై సందేహాలు నెలకొన్నాయి. మరోవైపు ప్రభుత్వం వర్కింగ్‌మోడల్ ప్రాజెక్టుల గురించి ఎలాగూ పట్టించుకోవపోవడంతో తొలుత ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ సబ్మిట్‌చేసిన డాక్యుమెంట్లు మాత్రమే ఆయా స్కూళ్లలో గైడ్ టీచర్ల వద్ద ఉంటాయని సమాచారం.

జాతీయస్థాయిలో మెరిసిన బాలమేధావుల ఆలోచనలెన్నో..

ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్లలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలు పాఠశాలల విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలే జాతీయ స్థాయిలో మెరియడం గమనార్హం. ప్రమాదకర పరిశ్రమల్లో విషవాయువులు వెలువడిన సందర్భాల్లో ప్రమాదస్థలికి ఎవరూ వెళ్లలేని పరిస్థితుల్లో ఆపదలోవున్న క్షతగాత్రులకు వైద్యసహాయం అందించేందుకు నూతన ఆవిష్కరణగా కలిదిండి జడ్పీ హైస్కూలు విద్యార్థి అబ్దుల్ హస్సేన్ 2019లో గైడ్‌టీచర్ ఎం.రామకృష్ణ సహకారంతో రూపొందించిన లైఫ్ ప్రొటెక్టర్ రోబో ప్రాజెక్టును జాతీయ ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్(ఢిల్లీ)లో ప్రదర్శించగా వినూత్న ప్రదర్శనగా బహుమతి లభించింది. ఆ తర్వాత 2021లో కొవిడ్ కారణంగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో కైకరం జడ్పీ హైస్కూలు విద్యార్థిని ఎం.దుర్గామంగ, గైడ్‌టీచర్ జాన్ సహకారంతో రూపొందించిన లోకాస్ట్ రోప్ మేకింగ్ మిషన్ ప్రాజెక్టు జాతీయస్థాయి విజేతగా నిలవడమేకాకుండా, ఆ మిషన్ తయారీకి పేటెంట్ హక్కులుకూడా లభించడం విశేషం. ఇలా దాదాపు ప్రతి ఏటా ఉమ్మడి జిల్లా విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్లలో జాతీయస్థాయిలో సత్తాచాటుతుంటే, ఈ పోటీలో పాల్గొనేందుకు ప్రాథమిక అర్హతఅయిన జిల్లాస్థాయి ఎగ్జిబిషన్లను నిర్వహించకపోవడంతో బయటిప్రపంచానికి తెలియకుండానే మరుగునపడుతున్నాయి.

నేటితో నామినేషన్ల గడువు ఆఖరు..

2023-24 విద్యా సంవత్సరంలో ఏలూరు జిల్లా నుంచి ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు మొత్తం 1,108 సైన్సు ప్రాజెక్టుల నామినేషన్లు రిజిస్టర్ కాగా, వాటిలో ఉత్తమమైన 132 ప్రాజెక్టులను సబ్మిట్ చేసిన విద్యార్థులను ఎంపికచేసి ఒకొక్కరికి రూ.10వేలు చొప్పున ప్రాజెక్టులను రూపకల్పనకు వారి బ్యాంకు ఖాతాలకు కేంద్రం జమచేసింది. ఆ తదుపరి 2024-24లో జిల్లానుంచి 1,816 నామినేషన్లు సబ్మిట్‌కాగా వాటిలో 218 ప్రాజెక్టులను ఎంపికచేసి నిధులు చెల్లించారు. ఈ ఏడాదికి సంబంధించి ఆదివారం మధ్యాహ్నం వరకు ఏలూరు జిల్లాలో 1,664, పశ్చిమ గోదావరి జిల్లాలో 1,091 నామినేషన్లు సబ్మిట్‌కాగా, తుది గడువు ఈనెల15వ తేదీతో ముగియనుంది. దీనిపై జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులును వివరణకోరగా.. రెండేళ్లుగా ఇన్‌స్పైర్ మనక్ జిల్లాస్థాయి ఎగ్జిబిషన్లు జరగకపోవడానికి గల కారణాలు తెలియదు. ఇటీవలే తాను సైన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. గత రెండేళ్లలో జిల్లానుంచి ఎంపికైన ప్రాజెక్టులు ఆయా విద్యాసంస్థల్లో భౌతికంగా ఇప్పుడు ఉన్నదీ, లేనిది తెలియదన్నారు.

నరసాపురం-మైసూర్ మధ్య స్పెషల్ రైళ్లు



నరసాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : దసరా, దీపావళి పండుగల రద్దీని పరిగణనలోకి తీసుకుని దక్షిణ మధ్య రైల్వే నరసాపురం-మైసూర్ మధ్య స్పెషల్ రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ రైళ్లు ఈనెల 19 నుంచి ప్రతి సోమ, శుక్రవారాల్లో నరసాపురం నుంచి, మంగళ, శనివారాల్లో మైసూర్ నుంచి ఈవిధంగా ఈ ఏడాది అక్టోబరు నెలాఖరు వరకు నడవ నున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. నరసాపురం నుంచి 07033 నంబ రుతో మధ్యాహ్నం 11.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం నాలుగు గంటలకు మైసూర్ చేరుకుంటుంది. తిరిగి అక్కడ నుంచి 07034 నంబరుతో సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.20 గంటలకు నరసాపురం చేరుకుంటుందన్నారు. విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్, వికారాబాద్, తాండూరు, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, ధర్మవరం, హిందూపురం, బెంగళూరు మీదుగా మైసూర్ వెళ్లనుంది. జిల్లాలో ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు రైల్వే స్టేషన్లలో ఆగనుంది.

నేటి నుంచి వదర్లపాడు రైల్వేగేటు మూసివేత

కైకలూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కైకలూరు-ఆకివీడు రైలు మార్గంలో వదర్లపాడు రైల్వేగేటు వద్ద ఈనెల 15వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 29వ తేదీ రాత్రి 7 గంటల వరకు మూసివేస్తున్నట్లు కైకలూరు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎండీ రెహమాన్ తెలిపారు. జాతీయ రహదారిపై వదర్లపాడు బ్రాంచి నుంచి సీతనపల్లి వెళ్లే రహదారిలోని 86వ నంబరు రైల్వేగేటును మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నామన్నారు. ఆ రహదారిలో వెళ్లే వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

చెక్ మేట్ సాల్వర్‌లో 'దేవాన్ష్' అరుదైన రికార్డు

తణుకు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తనయుడు దేవాన్ష్ మరో అరుదైన ఘనతను సాధించినట్లు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. ఆదివారం తణుకులో ఆయన మాట్లాడుతూ లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో జరిగిన చెస్ పోటీలకు సంబంధించి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించినట్లు తెలిపారు. వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్-175 పజిల్స్‌లో ప్రపంచ రికార్డు సాధించడం గర్వకారణమన్నారు. గతంలో చెక్ డొమైన్‌లోనూ మరో రెండు నెలకొల్పిన దేవాన్ష్ రికార్డు పట్ల రాధాకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

అధికారులు ఉత్తమ సేవలు అందించాలి

- ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని చట్టప్రకారం పరిష్కరించి సమర్థవంతమైన అధికారులుగా ఉత్తమ సేవలను ప్రజలకు అందించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదివారం ప్రొబేషనరీ డీఎస్పీలకు సూచించారు. ఏలూరు రేంజ్ కార్యాలయంలో ప్రొబేషనరీ డీఎస్పీల పనితీరుపై సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్పీల ఉద్యోగ నిర్వహణ, క్షేత్రస్థాయిలో పనితీరు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు లా అండ్ ఆర్డర్‌లో నిర్వర్తించిన విధులను సమర్థవంతంగా నేర్చుకుని భవిష్యత్ కాలంలో వాటిని వినయోగించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ఆలకించి తగిన సూచనలు, సలహాలతో క్రిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమావేశంలో ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం మార్కెట్‌కు 'ఉల్లి' రాక

- పది లారీల మహారాష్ట్ర ఉల్లి, మూడు లారీల కడప, కర్నూలు ఉల్లి దిగుమతి
- తగ్గిన వంగ.. ▸ పెరిగిన బెండ ధరలు



తాడేపల్లిగూడెం మార్కెట్లో ఉల్లిని పరిశీలిస్తున్న జేసీ

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి ఆదివారం 10 లారీల్లో ఉల్లిపాయలు వచ్చాయి. వీటిని క్వింటా రూ.1000 నుంచి రూ.1700 మధ్య విక్రయించారు. మంచి ఆరుదల, పాతపాయ ధర తగ్గింది. సైజు, నాణ్యత ఆధారంగా వ్యాపారులు మహారాష్ట్ర ఉల్లికి ధరను నిర్ణయించారు.

కడప, కర్నూలు నుంచి మూడు లారీల ఉల్లి..

మార్కెట్‌కు కడప నుంచి రెండు లారీలు, కర్నూలు నుంచి ఒక లారీ ఉల్లిని అక్కడి రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చారు. మూడు లారీల్లో సుమారు 52 టన్నులు వచ్చింది. వీటిలో 32 టన్నుల ఉల్లి మార్కెట్లో రూ.700 నుంచి 1200 మధ్య విక్రయాలు జరిగాయి. వీటిలో 20 టన్నుల ఉల్లికి క్వింటా రూ.600కు దిగువన ధర పలకడంతో జిల్లా జేసీ ఆదేశాలతో ఈ 20 టన్నుల ఉల్లిని వ్యాపారులకు అమ్మకుండా సొసైటీల ద్వారా విక్రయించే చర్యలు చేపడుతున్నారు.

తగ్గిన వంగ.. పెరిగిన బెండ ధరలు

మార్కెట్లో తెల్ల వంకాయ ధర తగ్గింది. గత వారంతో పోల్చుకుంటే కిలోకు రూ.20 తగ్గింది. గతవారం కిలో రూ.80 ఉంటే ఈవారం రూ.60కు పడింది. బెండకాయ ధర మాత్రం కిలోకు రూ.10 పెరిగింది. గత వారం కిలో రూ.20కు విక్రయించిన బెండ కాయలు ఇప్పుడు రూ.30కు విక్రయించారు. బీర రూ.50, దొండ రూ.40, టమాటా రూ.30, పచ్చిమిర్చి రూ.60, క్యారెట్ రూ.60, బీట్‌రూట్ రూ.60, కాకర రూ.50కు అమ్మారు.

కర్నూలు ఉల్లిని వినియోగించేలా చర్యలు చేపట్టాలి : జేసీ

కర్నూలు ఉల్లిని వినియోగించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రైతులకు లాభదాయకమైన ధరలను అందించాలని పశ్చిమ గోదావరి జిల్లా జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి వ్యాపారు లకు సూచించారు. తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి హోల్‌సేల్ ఉల్లి మార్కెట్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కడప, కర్నూలు నుంచి వచ్చిన ఉల్లి ఆక్షన్‌ను స్వయంగా ఆయన పరిశీలించారు. ఉల్లి ధర తక్కువ పలకడంతో హోల్‌సేల్ వ్యాపారులతో ఆయన మాట్లాడారు. కడప, కర్నూలు నుంచి వచ్చిన ఉల్లిని కొనడం ద్వారా ఉల్లి రైతులను ఆదుకోవచ్చన్నారు. ఇక్కడ వచ్చే రేటు కంటే ఎక్కువ రేటుల వచ్చే విధంగా మార్కెట్ యార్డులు, రైతు బజార్లు ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధరల లభించకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని కనీస మద్దతు ధర కల్పించేలా వ్యాపారులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్‌కౌసర్ భానో, మార్కెటింగ్ శాఖ డీడీ పాపారావు, ఏడీ సునీల్‌కుమార్, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, హోల్‌సేల్ వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ



దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న యాత్రికులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అందరికీ సెలవురోజు కావడంతో భక్తుల సందడితో ఆలయం శోభిల్లింది. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. దాదాపు 15 వేల మందికి పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి గంటన్నర పైబడి సమయం పట్టింది. దర్శనానంతరం ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బంగారు కిరీటం అందజేత



బంగారు కిరీటాన్ని అందిస్తున్న దాత



బంగారు కిరీటం

చినవెంకన్న ఆలయ ఉత్సవమూర్తులకు ఓ దాత కానుకగా బంగారు కిరీటాన్ని ఆదివారం అందజేశారు. ఏలూరుకు చెందిన కూచి కృష్ణమూర్తి కుటుంబసమేతంగా ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం 14 గ్రాముల బరువైన బంగారు కిరీటాన్ని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తికి అందజేశారు. దీని విలువ దాదాపు రూ.1.40లక్షలు వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నేడు క్షేత్రంలో శ్రీకృష్ణ జయంతి

ఆర్జిత కల్యాణం, సేవలు రద్దు

శ్రీవారి ఆలయంలో శ్రీకృష్ణజయంతి ఉత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. అష్టమి మిగులు తిథితోపాటు రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగే ఈ ఉత్సవ నేపథ్యంలో స్వామివారికి నిత్యం నిర్వహించే ఆర్జిత కల్యాణం, నిత్యార్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. సాయంత్రం నివేదనాది కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈనెల 16న సాయంత్రం క్షేత్రంలో ఉట్ల పండుగ, గ్రామోత్సవం జరుగుతాయని భక్తులు పాల్గొనాలన్నారు.

క్రైం సమాచారం

మహిళపై చాకుతో దాడి

- బంగారు నల్లపూసల గొలుసు అపహరణ



ఏలూరులో చికిత్స పొందుతున్న మల్లేశ్వరమ్మ

ఏలూరుక్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కిరాణాషాపు నిర్వహిస్తున్న ఒక మహిళపై గుర్తు తెలియని అగంతకుడు చాకుతో దాడి చేసి ఆమె మెడలోని బంగారు నల్లపూసల గొలుసు తెంపుకుని పరారయ్యాడు. తీవ్ర గాయాలకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు సమీపంలోని వట్లూరు అంగన్‌వాడీ కేంద్రం దగ్గరలో సింగంశెట్టి మల్లేశ్వరమ్మ, ఆమె భర్త నాగేశ్వరరావు కిరాణాషాపును ఇంట్లోనే నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో ఓ యువకుడు వచ్చి పాలప్యాకెట్లు కావాలని అడిగాడు. పాలు లేవని ఆమె చెప్పడంతో కూల్‌డ్రింక్ కావాలన్నాడు. ఆమె ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌లోని కూల్‌డ్రింక్ తేవడానికి లోపలికి వెళ్తుండగా ఆమెతోపాటు అకస్మాత్తుగా ఇంట్లోకి వెళ్లి ఆమెను పడవేసి చాకుతో దాడిచేసి మెడలో ఉన్న నల్లపూసల బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ఆమెను ఇరుగుపొరుగు వారు గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మరోవైపు త్రీటౌన్ ఎస్ఐ పి. అప్పారావు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి బాధితురాలి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరోవైపు అగంతకుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలోని తిమ్మాపురానికి చెందిన పాతపాటి పద్మజ(42) శనివారం ఉదయం ఇంటివద్ద పురుగుల మందు తాగింది. ఆ తరువాత పాదయాత్రగా ద్వారకాతిరుమలకు వెళ్తానని ఇంట్లో చెప్పి బయలుదేరింది. కొద్దిదూరం నడిచి వెళ్లిన ఆమె బ్రహ్మంగారి గుడి సమీపంలో పడిపోయింది. ఈ విషయం తెలుసుకున్న బంధువులు ఆమెను ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందిందని ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'కుక్కునూరు'లో వరుస చోరీల కలకలం

కుక్కునూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండల కేంద్రంలో వరుస చోరీల కలకలం ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల కుక్కునూరు గ్రామ శివారులోని రామాలయంలో దాదాపు రూ.36వేలు విలువైన అమ్మవారి మంగళసూత్రాలు చోరీకి గుర య్యాయి. రామాలయంలో ఏర్పాటు చేసిన సీసీకెమెరాలో చోరి దృశ్యాలు రికార్డయ్యాయి. ఆలయంలో ఉండి సేవ చేస్తున్న వీ.శంకుబాబు ఈ సంఘటన పై కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. అలాగే ఓ హోటల్‌లో పదార్థాల తయారీకి వినియోగించే పెద్ద గిన్నెలు కూడా చోరీకి గురయ్యాయి. కుక్కునూరు గ్రామానికి అనుకూని ఉన్న కిష్టారం గ్రామంలో ఓ రైతుకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీ కూడా చోరీకి గురైనట్లు సమాచారం. పోలీసులు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

జూనియర్ లెక్చరర్ల సంఘ రాష్ట్ర సహ అధ్యక్షుడిగా శ్రీనివాస్



ఏలూరు అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్ఏ) రాష్ట్ర సహ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన డాక్టర్ బీవీ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తిరుపతిలో జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. రాష్ట్రప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డును పొందిన ఆయన ప్రస్తుతం నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. నూతన కార్యవర్గ పదవీకాలం మూడేళ్లు. ఇంటర్మీడియట్ విద్యలో విద్యాసంబంధిత వ్యాసాలు, తెలుగు అకాడమీ ప్రచురణల్లో సైన్సు వ్యాసాలు రాశారు. ఎన్నిక అనంతరం నిర్వహించిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రాష్ట్రంలో జూనియర్ కళాశాలల పనివేళలను ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేలా సవరించాలని డిమాండ్ చేశారు. జూనియర్ లెక్చరర్లకు డిగ్రీ కళాశాలల అధ్యాపకులుగా పదోన్నతులు ఇవ్వాలని, సర్వీసులో సీనియర్లయిన జేఎల్స్‌కు ప్రిన్సిపాల్స్ పదోన్నతుల్లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేశారు. సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన శ్రీనివాస్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



నూజివీడులో పరీక్షకు హాజరైన బీటెక్ విద్యార్థులు

'గేట్' శిక్షణకు ప్రత్యేక ఆన్‌లైన్ పరీక్ష

నూజివీడు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గేట్ ప్రవేశ పరీక్షకు తర్ఫీదు ఇస్తూ ఆర్జీయూకేటీ పరిధిలో హయ్యర్ ఎడ్యుకేషన్, కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ సెల్ ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థులకు ప్రత్యేక పరీక్షను నిర్వహించారు. ఇంజినీరింగ్ తృతీయ చివరి సంవత్సరం విద్యార్థులు సుమారు 1500 మంది ఈ ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యారు. ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి వారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వర్సిటీ అధికారుల బృందం తెలిపింది. దాదాపు 150 మంది ఏఎస్ అకాడమీ నుంచి ఉచిత లెక్చరర్స్, టెక్స్ సిరీస్ అందించటం జరుగుతుందని, వర్సిటీ తరఫున 500 మందికి, సంబంధిత మెటీరియల్ ఇస్తావతని, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఏవో డాక్టర్ లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకడమిక్ డి.శ్రావణి, పి.శ్యామ్, డాక్టర్ సాదు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తులు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అడవి బిడ్డల ఆరాధ్య దైవం శ్రీగుబ్బల మంగమ్మ దర్శనాలకు భక్తులు ఆదివారం పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు ఏజెన్సీకి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు తీర్చుకున్నారు. శనివారం ఏజెన్సీవ్యాప్తంగా భారీవర్షాలు కురవడంతో కొండవాగులు పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహించాయి. ఆదివారం వాతావరణం పొడిగా మారడం, వాగులు తగ్గుముఖం పట్టడంతో భక్తులు భారీగా తరలివచ్చారు.

ఈ-కంటెంట్ అభివృద్ధి శిక్షణకు టీచర్ స్వామి ఎంపిక



కోటేశ్వరస్వామి

కాళ్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఐటీఈ, ఎన్‌సీఈఆర్టీ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ-కంటెంట్ అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్‌గా ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. ఆన్‌లైన్ శిక్షణలో మన రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన 20 మందిలో పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల స్పెషల్, సీనలి ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి ఎంపికయ్యారని కాళ్ల ఎంఈవో డి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. దేశవ్యాప్త శిక్షణకు ఎంపికైన స్వామిని ఎంఈవో-2 పి.ఏసుదాను, ఉపాధ్యాయులు అభినందించారు.

ద్వారకాతిరుమల ఆలయంలో రికార్డు అసిస్టెంట్ చేతివాటం

ద్వారకాతిరుమల,సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవస్థానంలో లీజెస్ విభాగంలో పనిచేసే ఓ రికార్డు అసిస్టెంట్ చేతివాటం ప్రదర్శించాడు. గతనెలలో దేవస్థానం నిర్వహించిన వేలంపాటలో పాటదారుడు చెల్లించిన సొమ్ములో రూ.9వేలు తగ్గించి మిస్‌లీనియస్ రసీదు రాసినట్టు సమాచారం. టీటీడీ కాంప్లెక్స్ షాప్ నంబరు 11కు సంబంధించి జరిగిన వేలంపాటలో సదరు రికార్డు అసిస్టెంట్ అనుమంచిపోలు సాయి చేతివాటం ప్రదర్శించాడు. దీన్ని కప్పి పుచ్చేందుకు కొందరు ఉద్యోగులు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు చెబుతున్నారు. హెచ్చు పాటదారుడు సిద్ధయ్య ఆగస్టు ఆరో తేదీన షాపు అద్దె సొమ్ము రూ.51 వేలును రికార్డు అసిస్టెంట్‌కు కట్టాడు. ఆ ఉద్యోగి ఇచ్చిన సొమ్ము మొత్తానికి ఎంఆర్ రాయకుండా రూ.9వేలు తగ్గించి రూ.42వేలుకు మాత్రమే రాశాడు. ఇదిలా ఉంటే రెండురోజుల క్రితం లీజెస్ విభాగం ఏఈవో రమణరాజు పాటదారుడు సిద్ధయ్యకు ఫోన్‌కు చేసి అద్దె చెల్లించమని అడిగాడు. తాను ఆగస్టులోనే రూ.51వేలు చెల్లించానని ఇంకా రూ.7వేలు మాత్రమే బాకీ ఉందని చెప్పాడు. దీనిపై ఏఈవో రూ.42వేలు మాత్రమే కట్టావని చెప్పడంతో అతడు కంగుతిన్నాడు. రికార్డు అసిస్టెంట్ రూ.9వేలు తగ్గించి ఎంఆర్ రాశాడని ఏఈవో రమణరాజు వివరణ ఇచ్చారు. అయితే బాధితుడు సిద్ధయ్య ఇంకా ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

గంగాలమ్మకు ప్రత్యేక అలంకరణ

నరసాపురం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎల్‌బిచర్ల గ్రామంలో కొలువైన గంగాలమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేకంగా అలంకరణ చేశారు. పువ్వులతో అమ్మవారికి అలంకరణ చేశారు. మోడీ, రాజుల్లంక, ఎల్‌బిచర్ల, రామన్నపాలెం, చామకూరిపాలెం లకు చెందిన భక్తులు అమ్మవార్ని దర్శించుకున్నారు.



చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే అభినందన

భీమవరం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు వస్తుందని, పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐసీసీ) డైరెక్టర్‌గా నియమితులైన జనసేన పార్టీ భీమవరం పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అంజిబాబు, జనసేన, టీడీపీ నాయకులు అభినందించారు.

అఖండ అన్నసమారాధన



ఆకివీడు సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు శాంతినగర్ వరసిద్ధి వినాయక దేవాలయంలో ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా పసందైన పిండి వంటలతో అన్నసమారాధన నిర్వహించారు. నిర్వాహకులు గంధం ఉమా, బొల్లా శేషుబాబు, రాజు, రామరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

పెంటపాడు: పెంటపాడు ఎస్సీ కాలనీలోని సింహా యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు హాజరై స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఫరూఖ్ బాధ్యతలు



ఆకివీడు సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా షేక్ అహ్మద్ ఫరూఖ్ నియమితులయ్యారు. ఫరూఖ్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన నందూరి వెంకటేశ్వర రావు భీమవరం కలెక్టరేట్‌కు ఏవోగా బదిలీ అయ్యారు. దీంతో డీటీగా ఉన్న ఫరూఖ్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. సోమవారం నుంచి తహసీల్దార్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటికే పరిమితమైన వృద్ధులకు సంచార శకటం ద్వారా వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు, పైడిపర్రు ప్రాంతంలో పర్యటించి ఎనిమిది మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. కందా వెంకట ప్రభాకరం ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

అసోసియేషన్‌లను బలోపేతం చేయాలి



తణుకు వాకర్స్ సంఘ అధ్యక్షుడు బసవా రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

తణుకు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ అసోసియేషన్‌లను బలోపేతం చేయడం ద్వారా సేవలను విస్తృతం చేయవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుంటూరి రామ రాజు అన్నారు. ఆదివారం రోటరీ క్లబ్‌లో తణుకు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బసవా రామకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా వాకర్స్ నాల్గవ వాకర్స్ కేబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎన్నో సంఘాలు పనిచేస్తున్నాయని చెప్పారు. కేవలం మొక్కుబడిగా కాకుండా సంఘాలు బలోపేతం అయ్యేలా నాయక త్వం వహించే వారు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. స్థానిక సంఘ అధ్యక్షు డు బసవా రామకృష్ణను గవర్నర్ రామరాజు మెమెంటో అందజేసి సత్కరించారు.

23 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



నరసాపురం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోకి కొప్పర్రు పెదపేటలో ఆదివారం రాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో 23 మంది దళిత మహిళలకు సుమారు రూ.3లక్షలు విలువ చేసే కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఇంజేటి జాన్‌కెనడీ అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ట్రస్టు ఫౌండర్ గంటా రాజ్‌కుమార్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ విచ్చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ వెంకటరమణ, ఎంపీపీ సోని, సర్పంచ్‌లు నల్లి వరలక్ష్మి, దొండపాటి వెంకట్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బూసి విశ్వేశ్వరరావు, పోలిశెట్టి బాబ్జీ, పోలిశెట్టి రఘురాం, వైదాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పశువులకు వ్యాక్సిన్లు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే బేతపూడి, రుస్తుంబాదా గ్రామాల్లో పశువర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువులకు వ్యాక్సిన్లు వేయనున్నట్లు ఆశాఖ ఏడీఈ డాక్టర్ సురేంద్రకుమార్ తెలిపారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం నెల రోజుల పాటు జరుగుతుందన్నారు. రైతులు గ్రామాల్లో నిర్వహించే క్యాంపుల్లో పశువులకు వ్యాక్సిన్లు వేయించుకోవాలని ఆయన కోరారు.

కొడమంచిలిలో యూత్ సండే

ఆచంట, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): కొడమంచిలి పెదపేట ప్యారిస్ ఆధ్వర్యంలో యూత్ సండే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ యువకులకు బైబిల్ క్విజ్, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డీఎస్సీలో ఎస్‌జీటీలో అర్హత సాధించి టీచర్ పోస్టు సాధించిన దేవాబత్తుల ప్రసన్నను కోట బాబూరావు కుటుంబం ఘనంగా సత్కరించారు.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించకుంటే ఆందోళన



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర రాజు

భీమవరం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలకు తీవ్ర పని ఒత్తిడి పెరిగిపోయిందని, ముఖ్యంగా అన్ని పనులు ఒకే సారి చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం వల్ల కొంతమంది వీఆర్వోలు ఆందోళన చెంది గుండెపోటు, యాక్సిడెంట్లతో మరణించడం జరుగుతోందని జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరంలో పెద్ద మసీదు వద్ద ఉన్న అంకాల ఆర్ఫ్‌లో ఆదివారంనాడు జరిగిన జిల్లా సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ మధ్యకాలంలో సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు చెయ్యాలని వీఆర్వో లాగిన్‌లకు అసంబద్ధత డేటా పంపించి, ఆ డేటా ప్రకారం వారి వివరాలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్లు తీసుకుని చెక్ లిస్టులు తయారుచేసి అవి కంప్యూటర్ల లాగిన్‌లో అప్లోడ్ చేసి ఎమ్మార్వో లాగిన్ కి పంపాలని విపరీతమైన ఒత్తిడి చేస్తూ వీఆర్వోలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. చాలామంది పని ఒత్తిడికి గురవుతున్నారు. ఇలాగే అధికారులు వీఆర్వోలను ఇబ్బందులకు గురిచేస్తే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఆందోళనకు పిలుపునిస్తామని అన్నారు. గణపవరం మండలంలో పనిచేస్తూ అకాల మరణం పొందిన అడబాల రామకృష్ణ ప్రసాద్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ గుమ్మల జకరయ్య, జిల్లా కోశాధికారి చిట్టిబాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అనూష పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

భీమవరం క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని 12వ వార్డులో పేకాట శిబిరంపై వన్‌టౌన్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రూ.2930 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అరెస్ట్ అయిన ముగ్గురిని సోమవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

కంపోస్టు యార్డు వద్దంటూ ఆందోళన



స్థానికులతో చర్చిస్తున్న విప్ నాయకర్

నరసాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘానికి కంపోస్టుయార్డు పెద్ద సమస్యగా మారింది. గోదావరి ఒడ్డున చెత్తను తొలగించాలని గ్రీన్‌ట్రిబ్యూనల్ ఆదేశించడంతో అధికారులు ఖాళీ స్థలాల కోసం వెతుకులాట మొదలుపెట్టారు. పురపాలక ఖాళీ స్థలాల్లో చెత్త వేయాలని ప్రయత్నించినా స్థానికుల నుంచి ప్రతిఘటనలు తప్పడం లేదు. తాజాగా ఆదివారం 28వ వార్డులో ఖాళీగా ఉన్న చెరువు స్థలాన్ని ఎంపిక చేశారు. ఆ స్థలాన్ని పరిశీలించేందుకు విప్ నాయకర్, కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ వెళ్లారు. అయితే స్థానికులు ఇక్కడ చెత్త వేయవద్దని విన్నవించారు. ఈక్రమంలో అధికారులు వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కానీ వారు అంగీకరించలేదు. దీంతో విప్ నాయకర్ జోక్యం చేసుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా చుట్టూ గోడ కట్టిస్తామని, కొద్ది రోజులు మాత్రమే చెత్త వేస్తామని, మీ ఇళ్లను ఖాళీ చేయించబోమని భరోసా ఇచ్చారు. ఇదే క్రమంలో అధికారుల్ని అన్ని చర్యలు తీసుకున్న తరువాతే చెత్త వేయాలని ఆదేశించారు.

చెస్ విజేతలకు బహుమతులు అందజేత



విజేతలతో మెంటే పార్థసారథి తదితరులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో భీమవరంలోని వన్ టౌన్ లో ఉన్న ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన ఇన్విటేషనల్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్-2025 పోటీల్లో గెలుపొందిన విజేతలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. జిల్లా చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఆరు గ్రూపుల్లోని విజేతలకు బహుమతులు అందించామని తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భీమవరం మెంటే వారి తోటలో వండర్ కిడ్స్ స్కూల్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయు లు ప్రారంభించారు. వండర్ కిడ్స్ స్కూల్ చైర్మన్ అల్లు రామకృష్ణ, వినాయక హాస్పిటల్ డాక్టర్ సీవీఆర్ గజపతి రాజు మాట్లాడుతూ అన్ని వయసుల వారికి అన్ని వ్యాధులపై ఉచిత పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, తహసీల్దార్ రావి రాంబాబు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



జాతరలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్డులోని రామాలయం వద్ద మావుళ్ళమ్మ జాతరను ఆయన ప్రారంభించారు. ఎన్నో ఏళ్ళుగా జాలర్ల సంఘం అమ్మవారి జాతర మహోత్సవాలను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించడం శుభ పరిణామమని అన్నారు. ముందుగా పొట్టేళ్లతో గరగలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో జాలర్ల సొసైటీ, జాలర్ల సంఘం, గంగాదేవి ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు

పెండింగ్ డీఏలు విడుదల చెయ్యాలి

భీమవరం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)కు వినతిపత్రాన్ని అందించారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, సీపీఎస్‌ని రద్దు చేసి కేంద్ర మెమో 57 ప్రకారంగా 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, అసెస్మెంట్ బుక్స్ రద్దు చేయాలని, అన్ని రకాల యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం, మండల అధ్యక్షుడు ఐ.శ్రీనివాస్, కార్యదర్శి పి.పీటర్, జిల్లా కార్యదర్శి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

అత్తిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి లయన్స్ క్లబ్‌లో ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 29 మందికి ఉచితంగా కళ్ళజోళ్లు ఇచ్చారు. 22 మందికి ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఎలుకల నిర్మూలన

అత్తిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎలుకల నిర్మూలనకు సమగ్ర యాజమాన్య పద్ధతులు అనుసరించాలని అత్తిలి వ్యవసాయ అధికారి టీకే రాజేష్ అన్నారు. ఎలుకల వల్ల భారతదేశంలో 50 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు నష్టపోతున్నట్లు తెలిపారు. విత్తనం నాటినప్పటి నుంచి పంట దిగుబడి వచ్చే వరకు ఎలుకలు నష్టాన్ని కలుగజేస్తున్నాయని అన్నారు. అపరాలకు సైతం 10 నుంచి 15 శాతం నష్టం వాటిల్లుతోందన్నారు. డెల్టా ప్రాంతంలో ఎలుకల ఉధృతి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. యాజమాన్య పద్ధతుల ద్వారా దుక్కి దున్నటం, కలుపు నివారణ చేయాలన్నారు. సామూహికంగా ఎలుకలను నిర్మూలించడానికి బుట్టలతో దమ్ము సమయంలోను పైరు తొలిదశలోనూ అమర్చాలని అన్నారు. పొగ యంత్రాల ద్వారా కూడా ఎలుకలు నిర్మూలించవచ్చునన్నారు. సామూహికంగా ఎలుకల నిర్మూలన చేయాలన్నారు.

జనసేనలో చేరికలు



జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేటకు చెందిన 100 మంది ఇతర పార్టీల వారు చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో ఆదివారం వీరు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పార్టీ కండువాను వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్గన్నపేటలో 25 కుటుంబాల వారు పార్టీ సేవలను గుర్తించి చేరడం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ములగాల సూర్యారావు, మండల పార్టీ అధ్యక్షుడు అడపా ప్రసాద్, జనసేన నాయకులు యర్రాపాటి రాజు పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామి పాలకవర్గం ప్రమాణ స్వీకారం

భీమవరం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భీమవరం భీమేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా గనిరెడ్డి త్రినాథ్, సభ్యులు గా పి.కార్తీక్, సీహెచ్ నాగలక్ష్మి, గంగాధర్ రావు, ఎ.హైమావతి, ఎం. శ్రీనివాసరావు, ఎం.రఘుబాబు, బి.లక్ష్మి, కె.వీర వెంకట రామశాస్త్రిలచే ఆలయ ఈవో తోట శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథులుగా శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు, ఎమ్మెల్యే అంజిబాబు విచ్చేసి సభ్యులను అభినందించారు.

'కారుమూరిపై విమర్శలు తగవు'

తణుకు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):గతంలో వైసీపీలో వున్న నాయకులు ఈరోజున టీడీపీ పంచన చేరి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై రాజకీయ విమర్శలు చేయడం తగదని వైసీపీ నాయకుడు వెలగల సాయిబాబారెడ్డి అన్నారు. ఆదివారం తణుకులోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కారుమూరి చేసిన ఆరోపణలకు తాము కట్టుబడి వున్నామని, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్ విసిరిన సవాల్‌కు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. బహిరంగ చర్చలకు సంబంధించిన సమయం, వేదిక వారే చెప్పాలన్నారు. సమావేశంలో దళిత మహాసభ నాయకుడు చింతపల్లి గురు ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, కొమ్మోజు రామకృష్ణ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గణపవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం జల్లికొమ్మరలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2012-13 7వ తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత స్మృతులను నెమరవేసుకున్నారు. ఒకరికి ఒకరు కుశలప్రశ్నలు వేసుకున్నారు. అనాటి గురువులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు పుప్పాల సూర్యప్రకాశ్, ఉపాధ్యాయులను సత్కరించారు.

బదిలీపై వెళుతున్న అధికారులకు సత్కారం



ఉండి, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): ఉండి మార్కెట్‌యార్డులో అగ్రికల్చర్ అసిస్టెంట్ జె.ఆల్ఫ్రెడ్, గ్రామ హార్టికల్చర్ అసిస్టెంట్ కీర్తి స్వప్న ప్రియలను రైతుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టరు పోలుబోతు రాము, నీటి సంఘం డైరెక్టరు కొమ్మన బాబి తదితరులు ఘనంగా సత్కరించారు.

పూర్వ విద్యార్థి సంఘం నూతన కమిటీ

ఆకివీడు రూరల్ సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): దుంపగడపలోని వివిగిరి ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. 2025-28 కాలానికి పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులుగా గొంట్లా కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్‌గా చింతలపాటి సీతారామరాజు, కార్యదర్శిగా నేరెళ్ళ రామచెంచయ్య, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారిగా గుర్రం ఈశ్వరరావు, కార్యనిర్వాహక సభ్యులుగా రాజరాజేశ్వరి, ముద్దేవిశ్వేశ్వరరావు, సిరాజుద్దీన్, అమీర్, కర్రెడ్డి వాసు, ముద్దే పెద్దిరాజులను ఎన్నుకున్నారు.

రమణ కుమార్‌కు ఉత్తమ అధ్యాపక అవార్డు



పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ అధ్యాపకునిగా పనిచేస్తున్న ఏఎస్ఎస్ రమణ కుమార్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు లభించింది. జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా ఆపన్న ప్రదీన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆదివారం ఉదయం గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో రమణ కుమార్‌కు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం (తిరుపతి) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, సంఘ పెద్దలు అవార్డు అందించి, ఘనంగా సత్కరించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

పెనుమంట్ర, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భట్లమగుటూరు వద్ద అతి వేగంగా నడుపుతున్న కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయిన సంఘటన చోటు చేసుకొన్నది. ఆదివారం నాడు నెల్లూరు నుంచి భీమవరం మీదుగా తూర్పు గోదావరి జిల్లాకి వెళ్ళే మార్గం మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ఈఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. సంఘటనా స్థలానికి స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది చేరుకున్నారు. పంట పొలాల్లో ఉన్న కారును రోడ్డు పైకి క్రేన్ సహాయంతో బయటకు తీసి పూర్తి వివరాలు సేకరించారు.

కాలువలో పడి బాలుడి గల్లంతు



జైదేవ్ (ఫైల్)

పాలకోడేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేంద్ర శివారు కట్టావారిపాలెంలో బాలుడు గోస్తనీ నదిలో పడి గల్లంతైన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. వేంద్ర శివారు వేంద్ర అగ్రహారం గ్రామ పరిధిలోని కట్టావారిపాలెంకు చెందిన బొక్కా శ్రీనివాసరావు రెండవ కుమారుడు జైదేవ్ (7) నౌడూరులోని ప్రైవేట్ స్కూల్‌లో ఒకటవ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో దగ్గరి బంధువైన మరో బాలుడు చరణ్‌తో కలిసి సైకిల్ తొక్కుకుంటూ అదే గ్రామంలో ఉన్న గోస్తనీ నదిపై ఉన్న బ్రిడ్జి పైకి వెళ్ళారు. అయితే ప్రమాదవశాత్తు బ్రిడ్జిపై నుంచి కాలువలో పడిపోయాడు. పోలీసులకు, ఫైర్ డిపార్ట్‌మెంట్ వారు చీకటి పడటంతో గాలింపు చర్యలు చేపట్టినా బాలుడి ఆచూకీ లభించలేదు. జైదేవ్ తండ్రి శ్రీనివాసరావు దుబాయ్‌లో ఉంటూ ఈ మధ్యనే కట్టావారిపాలెం వచ్చి లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటున్నాడు.

బైరాగిమఠంలో కల్యాణ మండపం నిర్మాణం



నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం

పెంటపాడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కే.పెంటపాడు గోపాలస్వామి ఆంజనేయస్వామి ఆలయంలో (బైరాగిమఠం) నూతనంగా కల్యాణ మండపం నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆలయంలో చాలా మంది వివాహాలు, శుభకార్యాలు నిర్వహించుకునేవారు. ఇప్పుడు ఈ ఆలయానికి కల్యాణ మండపం కూడా రానుంది. రూ.కోటి 30 లక్షలతో కల్యాణ మండపాన్ని నిర్మాణం చేస్తున్నారు. 7 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఆలయంలో ఆలయ పడమర వైపు ఉన్న స్థలంలో కల్యాణమండపం నిర్మాణం అవుతుంది. తొలుత కల్యాణ మండపానికి రూ.కోటి మంజూరు అయ్యాయి. అయితే అనంతరం పైన కూడా మరొక అంతస్తు వేసేందుకు గాను అదనంగా మరో రూ.30 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.

రోగులకు వసుధా ఫౌండేషన్ సాయం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వసుధా ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఇరువురు వ్యాధిగ్రస్తులకు రూ.25వేల ఆర్థిక సహాయం అందించినట్టు ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు తెలిపారు. చింతపర్రుకు చెందిన వ్యవసాయ కూలీ అంగర వెంకటేశ్వరరావుకు రూ.15వేలను ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామ రాజు పంపిన చెక్కును అందజేశారు. అదే గ్రామానికి చెందిన బొర్రా శ్రీనుకు రూ.10వేలు చెక్కును అందజేసినట్టు తెలిపారు.

బండి ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

మొగల్తూరు, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి):తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని వారి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వద్ద భక్తులకు కావల్సిన సదుపాయాలు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈవో మోకా అరుణ్ కుమార్ ఆలయ సిబ్బంది కల్పించారు.

ఆరో రోజు కొనసాగిన రిలే దీక్షలు



మొగల్తూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్ నుంచి వెంప వరకు మంజూరైన రహదారి నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని కోరుతూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆరవ రోజు రిలేదీక్షలు కొనసాగించారు. గాంధీబొమ్మల సెంటర్‌లో రిలేదీక్షా శిబిరంలో గ్రామానికి చెందిన యడ్ల చిట్టిబాబు, బంగారు సీతారామయ్య, అడ్డాల ఏడుకొండలు, కుందేటి వెంకటేశ్వరరావు, వాముశెట్టి బోసుబాబులు దీక్షలో పాల్గొని తమ నిరసన తెలిపారు.

పోడూరు టీడీపీ అధ్యక్షుడిగా రమేష్‌రాజు

పోడూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి):మండల టీడీపీ నూతన అధ్యక్షుడుగా పోడూరు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు రుద్రరాజు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా వద్దిపర్రు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శీలం శ్రీనివాసరావును నియమించారు. ఈమేరకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదివారం ప్రకటించారు. అనంతరం వీరిని పూలమాలలతో అభినందనలు తెలిపారు.

ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పోడూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వేడంగి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ నూతన ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా రేకపల్లి శ్రీనివాసరావు, మరో 9మంది బోర్డు సభ్యులుగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి పద్మారావు పాల్గొని అభినందించారు. ఎంపీటీసీలు దూసనపూడి దొరబాబు, యర్రంశెట్టి నరసింహా రావు, బొలిశెట్టి నాగరమేష్, కొత్రకూటి హరి, కూనపరెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు.

అయ్యో..రొయ్య !

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా వస్తున్నది తెలుసుకుని ఆయా ధరలు తగ్గిం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. 100 కౌంటు ధర రూ.235 ఉన్నప్పటికీ షరతులు వర్తిస్తున్నాయి, టన్నేజీ 3 కన్నా ఎక్కువగా ఉండాలని, వైరస్, విబ్రో సోకిన రొయ్యలకు ధర తగ్గిస్తున్నారు. ఇదిలా ఉండగా 100 కౌంటు నుంచి దిగువకు 90, 80, 70, 60 కౌంటు రొయ్యల ధరలకు మధ్య పెద్ద వ్యత్యాసం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో వీటి మధ్య రూ.20 నుంచి రూ.200 వరకు వ్యత్యాసం ఉండేది, ప్రస్తుతం అది కేవలం రూ.100 లోపే ఉందని రైతులు వాపోతున్నారు. ట్రంప్ ఎఫెక్టు వలన పెద్దకౌంటులు అయిన 20 నుంచి 50 వరకు ఇబ్బందులున్నా ఆపై కౌంటులకు ఎఫెక్టు ఎక్కువగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం, వ్యాపారులు ఒకేసారి ఆక్వా రైతులను నష్టాల ఊబిలోకి తోస్తున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని హేచరీల ద్వారా నాణ్యమైన సీడ్‌ను అందించాలని, కోల్డ్ స్టోరేజీలు నిర్మించి ఆక్వా రైతులకు అండగా ఉండాలని కోరుతున్నారు.



విస్సాకోడేరులో నిమజ్జనానికి బయలుదేరిన గణనాథుడు

ఘనంగా వినాయకుని ఊరేగింపు



తాడేపల్లిగూడెంలో వినాయకుని ఊరేగింపులో పాల్గొన్న వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో 22వ వార్డులో వినాయక చవితి ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి ఆదివారం స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్ పాల్గొన్నారు.

పాలకోడేరు: విస్సాకోడేరు గ్రామంలోని గాంధీపేటలో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక నిమజ్జనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గాంధీపేటలో 29 సంవత్సరాలుగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగానే ఈ ఏడాది కూడా రూ.1.20 లక్షలతో ఏర్పాటు చేసిన భారీ విగ్రహానికి గత 18 రోజులుగా గ్రామస్తులు పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగానే ఆదివారం వరసిద్ధి వినాయకుడిని ప్రత్యేక వాహనంలో అలంకరించి మేళతాళాలు, బుట్టబొమ్మలు, ఆసాదుల వేషధారణలు, కోయ నృత్యాలతో ఊరేగించి గ్రామంలోని పంట కాలువలో నిమజ్జనం చేశారు. దీనికి ముందు వరసిద్ధి వినాయకుని ముందుంచిన 15 కేజీల లడ్డూను కమిటీ సభ్యులు వేలంపాట నిర్వహించగా అదే గ్రామానికి చెందిన కునుకు దుర్గారావు రూ.72 వేలకు దక్కించుకున్నారు.